క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో కుంకుమ నోము



ఇంటింటికీ వెళ్లి పసుపు, కుంకుమను అందజేస్తున్న మహిళలు

తాళ్లరేవు: గ్రామ కుంకుమ నోము ఆచరించేందుకు 11 మంది మహిళలు హైదరాబాద్ నుంచి స్వగ్రామమైన పి.మల్లవరానికి వచ్చారు. గురువారం ఆ మహిళలు ఈ నోమును భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ముత్యాల జయలక్ష్మి, చంద్రభారతి, రాధిక కిరణ్ తదితరులు పి.మల్లవరంలో ధనిక, పేద అనే బేధం లేకుండా ప్రతి ఇంటికి వెళ్లి పసుసు, కుంకుమ, అరటి పండ్లను అందించారు.

ఆంజనేయస్వామి విగ్రహానికి విరాళం



ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు విరాళం అందజేసిన దాత దొరబాబు

అమలాపురం టౌన్: ఐ.పోలవరం మండలం ఎదుర్లంక గ్రామంలో కొత్తగా నిర్మించనున్న శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో ప్రతిష్ఠించే విగ్రహానికి కాట్రేనికోన మండలం ఉప్పూడి గ్రామానికి చెందిన రంబాల దొరబాబు రూ.75 వేల విరాళాన్ని సమకూర్చారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు ఈ విరాళాన్ని దొరబాబు గురువారం అందజేశారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే పొన్నాడ స్వగృహంలో ఈ కార్యక్రమం జరిగింది. దాత దొరబాబును ఎమ్మెల్యే అభినందించారు.

శాస్త్రీయ దృక్పథం అవసరం

యానాం: విద్యార్థుల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించడం ద్వారా విజ్ఞాన దాయక ప్రాజెక్టులు తయారు చేస్తారని ఎస్సై బడుగు కనకారావు అన్నారు. గురువారం శ్రీచైతన్య స్కూల్ 8వ తరగతి విద్యార్థి స్థానిక అబ్దుల్‌కలామ్ నగర్‌కు చెందిన నామూరి శ్రీలక్ష్మ రూపొందించిన 'పీస్ టైమ్ గాలంట్రీ అవార్డ్స్ ఫర్ బ్రేవరీ సోల్జర్స్' అనే ప్రాజెక్టు వర్క్‌ను ఆయన పరిశీలించి అభినందించారు.

నేడు బడ్జెట్ సమావేశం

యానాం: పుదుచ్చేరి అసెంబ్లీ ఒక రోజు సమావేశం శుక్రవారం ఉదయం 9.30 గంటలకు జరుగనుంది. స్పీకర్ ఆర్ సెల్వం అధ్యక్షతన జరిగే సమావేశంలో ఆర్థిక శాఖను సైతం నిర్వహిస్తున్న సీఎం రంగసామి 2023–24 ఆర్థిక సంవత్సరానికి పూర్తి స్థాయి బడ్జెట్‌ను సమర్పించనున్నారు. ఎటువంటి పన్నులు లేని రూ.11,600 కోట్ల ముసాయిదా బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. ఈ సమావేశంలో పాల్గొనడానికి ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ ఇప్పటికే పుదుచ్చేరికి చేరుకున్నారు.

నాడు- నేడు పనులకు శంకుస్థాపన

ఉప్పలగుప్తం: ఎస్.యానం గ్రామంలోని మండల పరిషత్ పాఠశాలల్లో నాడు–నేడు పనులకు ఎంపీపీ దంగేటి వీరఅమృత జానకి, జెడ్పీ ఉన్నత పాఠశాలలో పనులకు జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు గురువారం శంకుస్థాపనలు చేశారు. గ్రామంలో మూడు ఎంపీపీ పాఠశాలల అభివృద్ధికి ఒక్కో పాఠశాలకు రూ.12 లక్షలు కేటాయించగా, జెడ్పీ ఉన్నత పాఠశాలలో పలు అభివృద్ధి పనులకు రూ.66 లక్షలు, అదనపు తరగతి గదులకు రూ.33 లక్షల నిధులు విడుదల చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు పెట్టా అప్పారావు, దంగేటి రాంబాబు, నాయకులు జోగి రాజా, పొగాకు శ్రీను, లంకే శ్రీను, అయితాబత్తుల సూరిబాబు, కాయల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపు

యానాం: పుదుచ్చేరికి రూ.3,124 కోట్ల నిధులను కేటాయించినందుకు కేంద్ర ప్రభుత్వానికి సీఎం రంగసామి కృతజ్ఞతలు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పుదుచ్చేరికి వస్తు సేవలకు సంబంధించి జీఎస్టీ పరిహారం రూ.1,250 కోట్లు, ఏడవ వేతన సంఘం సిఫార్సులకు సంబంధించి ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు రూ.150 కోట్లు సైతం విడుదల చేసినట్లు వివరించారు.

ప్రమాదంలో వృద్ధురాలి మృతి

ఉప్పలగుప్తం: ఎస్.కొత్తపల్లిలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన వృద్ధురాలు గోసంగి దమయంతి (62) అక్కడికక్కడే మృతి చెందింది. ఎస్.కొత్తపల్లి నుంచి రాఘవుల పేటకు ఓ ఇంటిని కూల్చిన రద్దును తరలించి వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో ఆమె ప్రాణాలు విడిచింది. స్థానికుల కథనం ప్రకారం.. తన ఇంటి నుంచి కిరాణా సరకుల కోసం రోడ్డు చెంత నడిచి వెళుతున్న దమయంతిని వెనుక నుంచి ట్రాక్టర్ ఢీకొట్టింది. ఆమె తలపై నుంచి ట్రాక్టర్ చక్రాలు వెళ్లడంతో నుజ్జునుజ్జు అయింది. మృతురాలికి ఒక కుమార్తె, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఇంటిల్లపాదీ కూలీ పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

సేవ చేసి.. స్ఫూర్తిగా నిలిచి..

- విశ్రాంత ఉద్యోగి ఔదార్యం
- ఆశ్రమ పాఠశాలకు ఆస్తి దానం



తాళ్లరేవు రత్నవారిపేటలో నిర్మించిన కల్యాణ మండపం

తాళ్లరేవు: ఆయనొక విశ్రాంత ప్రైవేట్ ఉద్యోగి.. అయితేనేం సేవాగుణంతో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. తాను సంపాదించిందంతా పేద విద్యార్థుల విద్య, భోజనం కోసం, అలాగే పేదల వివాహాల కోసం దానం చేశారు. అతని ఔదార్యాన్ని అందరూ అభినందిస్తున్నారు. ఆ వివరాల్లోకి వెళితే... తాళ్లరేవు రత్నవారిపేటకు చెందిన రత్నా రామారావు చిన్నతనంలో ఎన్నో కష్టాలను అనుభవించారు. కనీసం తల్లిదండ్రులకు చదివించే స్థోమత లేకపోవడంతో వసతి గృహాల్లో ఉంటూ, చౌల్ట్రీలలో తింటూ విద్యాభ్యాసం సాగించారు. కష్టపడి చదివి 1967లో ఎస్ఎస్ఎల్‌సీ ఉత్తీర్ణులయ్యారు. అనంతరం ఐటీఐ చదివి 1977లో డిప్లొమా మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేశారు. విద్యాభ్యాసం పూర్తయిన తరువాత రాజమహేంద్రవరం ప్రైవేట్ ఐటీఐలో ఇన్‌స్ట్రక్టర్‌గా, రాజమహేంద్రవరం పేపర్ మిల్లులో మెకానికల్ ఇంజినీర్‌గా పనిచేశారు. తాను పెళ్లి కూడా చేసుకోలేదని ఆయన తెలిపారు. తన 75 ఏళ్ల వయసులో జీవితాన్ని సార్థకం చేసుకునేందుకు ప్రజలకు ఏదో ఒకటి చేయాలన్న తలంపుతో తాను జీవితాంతం సంపాదించినదంతా కోరంగి శ్రీదుర్గా మల్లేశ్వర వృద్ధుల, అనాథ బాలల ఆశ్రమానికి దానం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ మేరకు తనకున్న రూ.కోటి పైగా విలువ చేసే మూడు ఎకరాల రొయ్యల చెరువులను ఆశ్రమానికి ఇస్తున్నట్లు వీలునామా రాసి ఇచ్చారు. అదేవిధంగా తనకున్న పది సెంట్ల భూమిలో సర్వాంగ సుందరంగా నిర్మించిన కల్యాణ మండపాన్ని కూడా దానం చేశారు. ఆశ్రమ నిర్వహణలో పాఠశాలను ఏర్పాటు చేసి వారికి ఉచిత విద్య, భోజనాన్ని అందించాలని, పేదల పెళ్లిళ్లకు కల్యాణ మండపాన్ని వినియోగించాలని ఆశ్రమ నిర్వాహకులను కోరారు. తాను చిన్నతనంలో మల్లాడి సత్యలింగ నాయకర్ సత్రంలో, పైడా వెంకట చలమయ్య చౌల్ట్రీలో జీవనం సాగించానని వారి అంతగా కాకపోయినా వారి స్ఫూర్తితో తన కున్న దాంట్లో ఈ సేవ చేస్తున్నట్లు రామారావు తెలిపారు. పేదల కోసం ఆయన చేసిన త్యాగాన్ని గ్రామస్తులు అభినందిస్తున్నారు.



దాత రత్నా రామారావు



కల్యాణ మండపం లోపలి భాగం

వైభవం.. స్వామివార్ల కల్యాణం



యానాంలో రాజరాజేశ్వర స్వామివారి కల్యాణం చేస్తున్న పండితులు

అమలాపురం టౌన్: స్థానిక శివాలయం రోడ్డులోని శ్రీసర్వ మంగళ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో బుధవారం రాత్రి స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణం జరిగింది. మలకపలి బాలకృష్ణ, అలివేలు మంగతాయారు కల్యాణకర్తలుగా ఉండి స్వామి, అమ్మవార్ల కల్యాణ క్రతువు చేశారు. శైవాగమ విశారద వెలవలపల్లి సోమేశ్వరశర్మ బ్రహ్మత్వంలో స్వామి కల్యాణోత్సవాలు ఐదు రోజుల పాటు జరుగుతున్నాయని ఆలయ అనువంశిక ధర్మకర్తల మండలి చైర్మన్ మాచిరాజు రవికుమార్ తెలిపారు. ఆలయ కమిటీ సభ్యులు యర్రమిల్లి పాండురంగారావు, వాడ్రేవు గురువరాజు, జానకోట అచ్యుత రావు, సంగినీడి బేబి, తటవర్తి పద్మ పాల్గొన్నారు.

తాళ్లరేవు: వేంకటేశ్వర కల్యాణ వైభవ మహోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి పద్మావతీ సమేత శ్రీనివాసుని కల్యాణాన్ని తాళ్లరేవులో వైభవంగా నిర్వహించారు. స్థానిక బాలాజీ నగర్‌లో చిన్న వేంకటేశ్వరుని ఆలయం వద్ద స్వామివారి కల్యాణం జరిగింది. అనంతరం గానామృతం కార్యక్రమంలో భాగంగా మహిళలు స్వామివారి కీర్తనలు ఆలపించారు. ఈ నెల 5వ తేదీ వరకూ ఉత్సవాలు జరుగనున్నాయి. చివరి రోజు ఉదయం స్వామివారికి నాగవల్లి వసంతోత్సవం, రాత్రి 8 గంటలకు శ్రీపుష్పయాగం ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా నవగ్రహ నక్షత్ర పూజలు

ఉప్పలగుప్తం: విలసవిల్లి గ్రామంలో రామాలయం వద్ద నవగ్రహ నక్షత్ర పూజలు ఘనంగా జరుగుతున్నాయి. ఇందులో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఆయన తనయుడు శ్రీకాంత్ పాల్గొన్నారు. తొలుత మంత్రికి సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి సతీష్ ఆధ్వర్యంలో పురోహితులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. యాగకర్త మున్నంగి రామకృష్ణ శర్మ సౌరయాగం విశిష్టతను మంత్రికి వివరించారు. నక్షత్ర సంబంధిత పూజలు నిర్వహించి, పండితుల సమక్షంలో మంత్రికి వేద ఆశీర్వచనం అందించారు. వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిశోర్, రాష్ట్ర కార్యదర్శి దంగేటి రాంబాబు, నగరం పీఏసీఎస్ చైర్మన్ కఠకంశెట్టి ఆదిత్య, సలాది స్వామి నాయుడు, కోలా ఏసు, బళ్ల నాగసతీష్ పాల్గొన్నారు.

రాజరాజేశ్వరుని కల్యాణం

యానాం: యానాంలో కొలువైన రాజరాజేశ్వరీ సమేత రాజరాజేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవం గురువారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీరాజా మన్యం కనకయ్య జమిందార్ కుమారుడు ఫణికుమార్ దంపతులచే నిర్వహించిన స్వామివారి కల్యాణానికి యానాం, పరిసర ప్రాంతాల భక్తులు హాజరయ్యారు. స్వామివారికి పుదుచ్చేరి ప్రభుత్వం తరఫున ప్రాంతీయ పరిపాలనాధికారి మునిస్వామి పట్టు పీతాంబరాలు, సువర్ణ యజ్ఞోపవేతం సమర్పించారు. వేద మంత్రోచ్చరణల మధ్య జరిగిన స్వామివారి వివాహం కనుల పండువగా జరిగింది. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కాపగంటి ఉమాశంకర్, ఉపాధ్యక్షుడు యాళ్ల మీరయ్య తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో గజ వాహనోత్సవాన్ని నిర్వహించారు.



విలసవిల్లిలో మంత్రి విశ్వరూప్‌కు వేద ఆశీర్వచనం అందిస్తున్న పండితులు



తాళ్లరేవు బాలాజీనగర్‌లో శ్రీనివాస కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

8 నుంచి వార్షికోత్సవాలు

అమలాపురం టౌన్: స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయంలో ఈ నెల 8 నుంచి 16వ తేదీ వరకూ అమ్మవారి జన్మదిన వార్షికోత్సవం, మహా సంప్రోక్షణ, మహా విద్యా పూర్వక నవ చండీ యాగ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ గంగాబత్తుల రాంబాబు తెలిపారు. తొమ్మిది రోజుల పాటు జరిగే ఈ పూజల్లో రోజూ అమ్మవారికి పలు అభిషేకాలు, వివిధ నిత్య హోమాలు నిర్వహిస్తామన్నారు. రోజూ ఉదయం 10 గంటల నుంచి 11.45 గంటల వరకూ అమ్మవారి సన్నిధిలో లోక కల్యాణార్థం, కరోనా వ్యాధి నివారణార్థం మహా మృత్యుంజయ హోమం , ధన్వంతరి హోమం చేపడతారన్నారు. 16వ తేదీ సాయంత్రం పూర్ణాహుతి, 17వ తేదీ మధ్యాహ్నం అన్న సమారాధన ఉంటుందని ఉత్సవ కమిటీ చైర్మన్ రాంబాబు తెలిపారు. .

అప్రమత్తతతో ప్రమాదాల నివారణ

అమలాపురం రూరల్: డ్రైవర్లంతా అప్రమత్తతతో వాహనాలను నడపడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా రవాణా శాఖ అధికారి అశోక్ ప్రతాప్ అన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ రహదారి భద్రతా వారోత్సవాల ముగింపు వేడుకలను అమలాపురం ఆర్టీసీ డిపో గ్యారేజీలో గురువారం జిల్లా ప్రజా రవాణా అధికారి ఆర్‌వీఎస్ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. పట్టణ ట్రాఫిక్ ఎస్సై భద్రరాజు మాట్లాడుతూ డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని అన్నారు. కిమ్స్ మెడికల్ ఆఫీసర్ పీఎస్ శర్మ మాట్లాడుతూ డ్రైవర్లు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా స్థాయిలో ముగ్గురు ఉత్తమ యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లకు, డిపో స్థాయిలో 12 మంది ఉత్తమ యాక్సిడెంట్ ఫ్రీ డ్రైవర్లకు ప్రశంసా పత్రాలు అందించారు. చిత్రలేఖన పోటీలలో 20 మంది విద్యార్థులకు బహుమతులు అందించారు. పర్సనల్ ఆఫీసర్ ఎస్‌వై ప్రసాద్, అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణ మూర్తి, రాజోలు డిపో మేనేజర్ భాస్కరరావు, రావులపాలెం డిపో మేనేజర్ కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రవాణా శాఖ అధికారి అశోక్ ప్రతాప్

సర్పంచుల ప్రతినిధిగా అరుణకుమారి

అమలాపురం రూరల్: అమలాపురం నియోజకవర్గ సర్పంచుల ప్రతినిధిగా కామనగరువు సర్పంచ్, మండల సర్పంచుల సమాఖ్య అధ్యక్షురాలు సక్కా అరుణకుమారిని నియమించారు. నియోజకవర్గ సర్పంచుల ప్రతినిధుల ఐక్యవేదిక పేరుతో తాడేపల్లిలోని వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి అధ్యక్షతన 175 నియోజకవర్గాల సర్పంచుల తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అమలాపురం నియోజకవర్గ ప్రతినిధిగా అరుణకుమారిని నియమించారు. ఆమెను మంత్రి ముత్యాల నాయుడు అభినందించారు. తనకు పదవి ఇచ్చినందుకు రవాణా శాఖ మంత్రి విశ్వరూప్, నాయకులు, తోటి సర్పంచులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.



అరుణకుమారిని అభినందిస్తున్న మంత్రి ముత్యాల నాయుడు

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

యానాం: ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని విశ్రాంత రవాణా అధికారి పుదువై బాలకృష్ణన్ అన్నారు. గురువారం యానాం పబ్లిక్ స్కూల్‌లో పుదుచ్చేరి రవాణా శాఖ ఆధ్వర్యంలో ట్రాఫిక్ నిబంధనలు, సిగ్నల్స్‌ను గుర్తించడం తదితర వాటిపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ హెల్మెట్ ధరించడం వల్ల లాభాలు, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. హెచ్‌ఎం బాలాజీ సుధాకర్, జనవిజ్ఞాన వేదిక కోఆర్డినేటర్ ఆనాల వీరభద్రరావు, టీచర్లు భారతి, భానుమతి, లలితా సావిత్రి, సీఎస్ఎస్ కోఆర్డినేటర్ బొట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న విశ్రాంత అధికారి

వీరేశ్వరునికి రుద్ర హోమం

ఐ.పోలవరం: ఆరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో రుద్ర హోమం చేశారు. గురువారం ఆలయ అర్చకస్వామి పేటేటి శ్యామల కుమార్ ఆధ్వర్యంలో పలువురు పండితులచే స్వామివారికి విఘ్నేశ్వర పూజ, మండపారాధన, రుద్రహోమం ఇతర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

కంటి వైద్య శిబిరానికి స్పందన

యానాం: యానాం ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో గురువారం నుంచి ప్రారంభమైన మెగా కంటి వైద్య శిబిరానికి రోగులు తరలిరావడంతో కంటి వైద్య విభాగం కిటకిటలాడింది. 5వ తేదీ వరకు నిర్వహించే శిబిరంలో భాగంగా మొదటి రోజు 150 మంది రోగులను కంటి ఆపరేషన్లకు సిద్ధం చేసినట్లు జీజీహెచ్ డిప్యూటీ డైరెక్టర్ టి.రవిశంకర్ తెలిపారు. పుదుచ్చేరి డాక్టర్ తనకాచలం ఆధ్వర్యంలో 12 మంది కంటి వైద్యుల బృందం వచ్చి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహిస్తుంది.

రక్త పింజర హతం



మెస్‌లో చిక్కుకున్న రక్త పింజర

అల్లవరం: ఓడలరేవులోని సోమాని వెంకటరమణకు చెందిన కొబ్బరి తోటలో ఉపాధి కూలీలు పనులు చేస్తుండగా రక్త పింజర కనిపించింది. తోటలో మామిడి చెట్టు చుట్టూ ఏర్పాటు చేసిన మెస్‌లో ఆ పాము చిక్కుకుంది. దానిని ఉపాధి కూలీలు హతమార్చారు. ఇది సుమారు ఆరు అడుగుల పొడవు ఉందని రైతు తెలిపారు.

బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపిక



శ్రీకిరణ్

అమలాపురం రూరల్: కృష్ణా జిల్లా నూజివీడులో ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకూ జరిగే ఆంధ్రప్రదేశ్ అంతర జిల్లాల స్కూల్ గేమ్స్ బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టుకు కామనగరువు ఆదిత్య స్కూల్ విద్యార్థి ఇళ్ల శ్రీకిరణ్ ఎంపికయ్యాడు. ఆ విద్యార్థిని ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, డైరెక్టర్ శృతిరెడ్డి, స్కూల్ ప్రిన్సిపాల్ బి.రామ ప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

వేధింపులపై కేసు నమోదు

ఐ.పోలవరం: ఓ బాలికను వేధిస్తున్న వ్యక్తిపై బాధితురాలి తల్లి ఫిర్యాదు మేరకు ఐ.పోలవరం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం .. టి.కొత్తపల్లికి చెందిన కర్నీడి భానుప్రసాద్ అనే వ్యక్తి ఓ బాలికను వేధిస్తున్నాడని, తరచూ ఫోన్‌లు చేసి బెదిరిస్తున్నాడని తల్లి ఫిర్యాదు చేసింది. ఈ విషయంపై తల్లి పెద్దలతో చెప్పినా ఫలితం లేకపోవడంతో పోలీసులను ఆశ్రయించింది. బాలిక తండ్రి ఏడాదిన్నర కిందట మరణించాడు. తనకు, తన కుమార్తెకు కర్నీడి భానుప్రసాద్ నుంచి ప్రాణహాని ఉందని ఆమె పేర్కొంది. కేసును ఎస్సై రాజేష్ దర్యాప్తు చేస్తున్నారు.

విద్య, వైద్య రంగాలకు ప్రాధాన్యం



అల్లవరం సీహెచ్‌సీలో ఆరోగ్యశ్రీ హెల్ప్ లైన్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి విశ్వరూప్

అల్లవరం: ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం ఇస్తుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గురువారం అల్లవరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆరోగ్యశ్రీ హెల్ప్ లైన్ సెంటర్‌ను విశ్వరూప్ ప్రారంభించారు. అనంతరం సీహెచ్‌సీలో సూపరింటెండెంట్ సుధీర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడారు. నాడు– నేడు పథకంలో ఈ సీహెచ్‌సీని 50 పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేస్తున్నామని అన్నారు. నెల రోజుల్లో ఈ ఆసుపత్రి వినియోగంలోకి వస్తుందన్నారు. వైఎస్సార్ ఆరోగ్యశ్రీ సహాయ కేంద్రం ద్వారా ఆరోగ్యశ్రీ పథకంలో వర్తింపజేసే రోగాలపై సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, సర్పంచ్ బొమ్ము బాలవేణి, ఎంపీటీసీ మౌనిక, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాదు, సొసైటీ అధ్యక్షుడు యల్లమిల్లి బోసు, పార్టీ నాయకులు బొక్కా శ్రీను, దాసం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాలతోనే గ్రామాభివృద్ధి

ఉప్పలగుప్తం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేసిన సచివాలయాల వ్యవస్థతో గ్రామాల అభివృద్ధి జరుగుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. విలసవిల్లి గ్రామంలో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో సచివాలయ భవనాన్ని గురువారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏవిధమైన సమస్య వచ్చినా మండల కేంద్రానికి వెళ్లి పడిగాపులు పడేవారని, ప్రస్తుతం వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాలతో గ్రామాల్లో అన్ని శాఖల ఉద్యోగులు అందుబాటులో ఉండి ప్రజల అవసరాలను తీర్చుతున్నారన్నారు. ఎటువంటి సర్టిఫికెట్‌నైనా 72 గంటల్లో జారీ చేస్తున్న ఘనత సచివాలయ వ్యవస్థదే అని అన్నారు. విలసవిల్లి గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తానని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ దంగేటి వీరఅమృత జానకి, జెడ్పీటీసీ సభ్యుడు గెద్దం సంపదరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, వైఎస్సార్ ఉద్యానవన బోర్డు సభ్యుడు జిన్నూరి వెంకటేశ్వరరావు, పినిపే శ్రీకాంత్, ఎంపీడీవో కేఏస్ గౌరీకుమారి, కార్యదర్శి దాసరి కృష్ణాజీ తదితరులు పాల్గొన్నారు.

సేవా సంఘం ఆవిర్భావం



నానిరాజును సత్కరించిన డాక్టర్ ప్రతాప్, కవులు, రచయితలు

అమలాపురం టౌన్: అమలాపురంలో సాయి సంజీవిని వాకర్స్ యోగా హెల్త్ సేవా సంఘం గురువారం ఏర్పాటైంది. కోనసీమ రచయితల సంఘం గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు ఈ సంఘానికి అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు స్థానిక కూచిమంచి అగ్రహారంలో సమావేశం జరిగింది. వైద్య, సామాజిక సేవలు అందిస్తున్న నానిరాజు సాయి సంజీవిని వాకర్స్ యోగా సేవా సంఘం అధ్యక్షునిగా ఎన్నిక కావడం అభినందనీయని శ్రీశ్రీ కళా వేదిక జాతీయ చైర్మన్, కవి డాక్టర్ కత్తిమండ ప్రతాప్ అన్నారు. సాయి సంజీవిని ఆస్పత్రి ద్వారా సేవలందిస్తున్న తాను ఇకపై వాకర్స్, యోగా రంగాల్లో కూడా ఆరోగ్యపరంగా మరిన్ని సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నానని నానిరాజు అన్నారు. అనంతరం నానిరాజును ప్రతాప్ సత్కరించారు. శ్రీశ్రీ కళా వేదిక జాతీయ కన్వీనర్ కొల్లి రమావతి, వాకర్స్, యోగా సేవా సంఘం కార్యదర్శి, కవి నల్లా నరసింహమూర్తి, కోశాధికారి, కవి బీవీవీ సత్యనారాయణ, జాలీ వాకర్ కడలి సత్యనారాయణ, రచయిత్రి కుంపట్ల సుభాషిణి అరుణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటుకు వినతి



ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దింపు, ఒలుపు కార్మిక సంఘాల నాయకులు

ముమ్మిడివరం: దింపు, ఒలుపు కార్మికులకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతూ ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌కు కార్మిక సంఘాల నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. దింపు, ఒలుపు కార్మికుల సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు బొడ్డు నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయా సంఘాల నాయకులు ఎమ్మెల్యే సతీష్‌కుమార్‌ను ఆయన నివాసంలో కలసి ఈ మేరకు వినతి పత్రం అందజేశారు. 50 ఏళ్లు దాటిన దింపు, ఒలుపు కార్మికులకు పింఛను, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే పొన్నాడ మాట్లాడుతూ ఈ సమస్యలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకు వెళ్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తో పారదర్శక పాలన

- మంత్రి పినిపే విశ్వరూప్
- గోడిలంకలో గడప గడపకూ..



సంక్షేమ పథకాల బ్రోచర్‌ను లబ్ధిదారునికి అందిస్తున్న మంత్రి పినిపే విశ్వరూప్

అల్లవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రంలో పారదర్శక పాలన సాగుతుందని రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. గోడిలంకలో ఎంపీడీఓ జి.సరోవరరావు ఆధ్వర్యంలో గురువారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వివిధ సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ఆయా కుటుంబాలకు మంత్రి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చొరవ తీసుకుంటున్నామని అన్నారు. రానున్న ఏడాది కాలంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని మంత్రి వివరించారు. లబ్ధిదారుల చెంతకే పథకాలు, సచివాలయ వ్యవస్థతో గ్రామాల్లో పౌర సేవలు అందిస్తున్నారని తెలిపారు. సచివాలయాల్లో సుమారు 14 వేల ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కానుందన్నారు. జగనన్నను తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రజలంతా సహకరించాలని కోరారు. ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ, గృహ సారథుల కన్వీనర్ తిక్కా ప్రసాదు, పినిపే శ్రీకాంత్, మండల పార్టీ అధ్యక్షుడు కొనుకు బాపూజీ, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉండ్రు వెంకటేశ్వరరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి నాతి శ్రీనివాసరావు, ఇన్‌చార్జ్ సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు తదితరులు పాల్గొన్నారు. తొలుత గోడిలంక సచివాలయ ఆవరణలో పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి ఎ.జైపాల్ ఆధ్వర్యంలో మండలానికి కేటాయించిన పశు వైద్య సంచార వాహనాన్ని మంత్రి విశ్వరూప్ ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ పశు వైద్య సేవలను చేరువ చేసేందుకు నియోజకవర్గానికి రెండు అంబులెన్స్‌లు కేటాయించారన్నారు. పశువులు అనారోగ్యానికి గురైతే 1962కి కాల్ చేస్తే పశువులున్న చోటుకు వచ్చి వైద్యం చేస్తారని తెలిపారు. ఏడీ విజయారెడ్డి, పశు వైద్యాధికారి సీహెచ్ నారాయణరావు, డాక్టర్లు శివరామకృష్ణ, పెబ్బాసా పాల్గొన్నారు.

చిత్తడి నేలలను సంరక్షించుకోవాలి



విజేతలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలు ఇస్తున్న ఎంపీపీ సునీత, జెడ్పీటీసీ శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: పర్యావరణానికి మేలు చేసే చిత్తడి నేలలను సంరక్షించుకోవాలని జిల్లా అటవీ అధికారి ఐకేవీ రాజు కోరారు. గురువారం చొల్లంగి పంచాయతీ పరిధిలోని కోరంగి అభయారణ్యంలో ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ జంతు, మత్స్య సంపద వృద్ధికి, కాలుష్య నివారణకు చిత్తడి నేలలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యుడు దొమ్మేటి శామ్యూల్ సాగర్ మాట్లాడుతూ ఇక్కడ అభయారణ్యం ఉండడం మన అదృష్టమన్నారు. అభయారణ్యం ప్రాముఖ్యతను దశదిశలా వ్యాపింపజేయాలని కోరారు. అనంతరం పలు పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అటవీ అధికారులు అవగాహన కల్పించారు. వివిధ పోటీలలో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఫారెస్ట్ రేంజర్ ఎస్ఎస్‌పీఆర్ వరప్రసాదరావు, కోఆర్డినేటర్ కేసరి శ్రీనివాసరావు, కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్, ఎంపీటీసీ సభ్యులు పోతుల రత్నకుమారి, ఉప సర్పంచ్ కామాడి భైరవమూర్తి పాల్గొన్నారు.

పోలీసులకు దేహదారుఢ్య పరీక్షలు

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులకు, పోలీసు అధికారులకు గురువారం స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆవరణలో శారీరక దారుఢ్య పరీక్షలు నిర్వహించారు. ఇవి సీఐ గూటం శివగణేష్ పర్యవేక్షణలో జరిగాయి.